# Eenadu

## కాపు యువతకు ఉద్యోగ మేళాలు

ఈనాడు, హైదరాబాద్: కాపుల కోసం వివిధ జిల్లాల్లో వచ్చేనెల 17 నుంచి 19వ తేదీ వరకు ఉద్యోగ మేళాలను నిర్వహించాలని కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షుడు చలమలశెట్టి రామానుజం అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ ఏడాది ఐదు జిల్లాల్లో ఒక్కొక్కటీ రూ.5 కోట్ల వ్యయంతో ఐదు కాపు భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. విద్యోన్నతి పథకం కింద 500 మంది అభ్యర్థులను సివిల్స్ శిక్షణకు పంపినట్లు, నైపుణ్య శిక్షణ పథకం కింద 13,380 మంది లబ్ధిపొందారని తెలిపింది. ఇందుకు రూ.115.31 కోట్ల వ్యయమైనట్లు సంస్థ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనంతరాము, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి హేమామునియప్ప, సంస్థ ఎండీ అమరేంద్ర, డైరెక్టర్లు వేణుగోపాలరాయుడు, నవీన్, సాంబశివరావు, పెంచలయ్య, రామచంద్రరావు, మురళీమోహన్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు. కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ అమలుచేస్తున్న పథకాలపై కాపు ప్రజాప్రతినిధులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సదస్సు నిర్వహించాలని యోచిస్తున్నట్లు అధ్యక్షుడు రామానుజం చెప్పారు.